

పైరవీలకు తావులేకుండా ప్రభుత్వ పథకాలు అమలు
- ఎమ్మెల్యే విజయరమణారావు
8లో..

సీఎండీ బదిలీపై బీఎంఎస్ ఆధ్వర్యంలో సంబరాలు
8లో..

డీఎంఎఫ్‌టీ పనులపై ఆరా

- జిల్లాలో రూ.656.27 కోట్లతో 1,587 పనులు
- ప్రారంభం కాని వాటిని రద్దు చేసే యోచన
- ఎమ్మెల్యేల ద్వారా ప్రతిపాదనలు స్వీకరించే అవకాశం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్ట్(డీఎంఎఫ్‌టీ) ద్వారా మంజూరు చేసిన పనులపై జిల్లా అధికార యంత్రాంగం ఆరా తీస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు వచ్చిన నిధులు ఎన్ని, వాటితో ఎన్ని పనులు మంజూరుచేశారు? అందులో ఎన్ని పూర్తయ్యాయి? ఎన్ని పనులు ప్రగతిలో ఉన్నాయి? అసలే మొదలు పెట్టి పనులు ఎన్ని ఉన్నాయి? అనే విషయమై సంబంధిత అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రారంభం కాని పనులను రద్దు చేసి ప్రస్తుత ఎమ్మెల్యేల ద్వారా ప్రతిపాదనలు స్వీకరించి వాటికి పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసి పనులను ప్రారంభించే యోచనలో అధికారులు ఉన్నారు.

● సీనరేజీ నుంచి 30శాతం నిధులు..

జిల్లాలో సింగరేణి బొగ్గు గనులు విస్తరించడంతో పాటు గ్రానైట్ క్వారీలు, ఇసుక క్వారీలు, కంకర క్వారీలు, కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ, ఆర్ఎఫ్‌సీఎల్ తదితర పరిశ్రమలు ఉన్నాయి. వీటి ద్వారా సహజ వనరులను తవ్వి ఆయా అవసరాలకు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఆయా సంస్థలు సహజ వనరులను తోడుకుని తీసుకువెళ్లేందుకు ప్రభుత్వ పరంగా అనమతులు ఇస్తుంది. బొగ్గు, ఇసుక, కంకర, గ్రానైట్ రాళ్లు, మట్టిని తరలించేందుకు సీనరేజీ పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. అందులో నుంచి 30 శాతం డబ్బులను డీఎంఎఫ్‌టీకి జమచేసే విధంగా కేంద్ర ప్రభుత్వం 2015లో ప్రధానమంత్రి ఖనిజ క్షేత్రయోజన పథకాన్ని తీసుకవచ్చింది. ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్టును ఏర్పాటు చేశారు. 2016 జనవరి 1 నుంచి జరిగే సహజ వనరుల తవ్వకాలపై వచ్చే సీనరేజీ నుంచి 30శాతం నిధులను డీఎంఎఫ్‌టీకి జమ చేయాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ నిధులను ప్రభావిత గ్రామాలతో ఇతర గ్రామాలకు 60:40 నిష్పత్తిలో వినియోగించాలని సూచించింది. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాకు 2016-17లో రూ.174 కోట్లకు రూ.44 కోట్లు, 2017-18లో రూ.251 కోట్లకు రూ.411 కోట్లు, 2018-19లో రూ.211 కోట్లకు రూ.207 కోట్లు, 2019-20లో రూ.182 కోట్లకు రూ.42 కోట్లు, 2020-21లో రూ.134 కోట్లకు రూ.122 కోట్లు, 2021-22లో రూ.134 కోట్లకు రూ.122 కోట్లు, 2022-23లో రూ.233 కోట్లకు రూ. 64 కోట్లు, 2023-24లో రూ.158 కోట్లకు రూ.138 కోట్లు జమ అయ్యాయి. మొత్తం రూ.1524 కోట్లకు రూ.1044 కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ నిధులన్నీ 2017 నుంచి ఆయా సంస్థల నుంచి డీఎంఎఫ్‌టీకి జమయ్యాయి.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

పెద్దపల్లి జిల్లా 2016 అక్టోబరులో ఏర్పాటైనందున ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఇతర జిల్లాలకు కూడా వాటా ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 112 జారీ చేసింది. 2018-19లో పెద్దపల్లి జిల్లాతో పాటు కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్ధిపేట, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో 7428 పనులు చేపట్టేందుకు 603 కోట్ల 96 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. ఇందులో పెద్దపల్లి జిల్లాలో 1119 పనులకు 272కోట్ల 56లక్షల రూపాయలు కేటాయించారు. ఆ తర్వాత 2019-20 నుంచి 2023-24 వరకు జిల్లాలో 468 పనులకు 383 కోట్ల 71 లక్షల నిధులు మంజూరు చేశారు. డీఎంఎఫ్‌టీ ద్వారా ఇప్పటివరకు పెద్దపల్లి జిల్లాలో 656 కోట్ల 27 లక్షలతో 1587 పనులకు పరిపాలనా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పనుల్లో చాలా వరకు పూర్తి కాగా, మరికొన్ని పనులు ప్రగతిలో ఉన్నాయి. కొన్ని పనులు ప్రారంభం కాకుండా ఉన్నాయి. పూర్తయిన, ప్రగతిలో ఉన్న పనులకు 402కోట్ల 58లక్షల రూపాయలు కాంట్రాక్టర్లకు చెల్లించారు. నెల రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడంతో పాటు రాష్ట్రంలో అదే పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో డీఎంఎఫ్‌టీ ద్వారా మంజూరు చేసిన పనుల్లో ప్రారంభం కాని పనుల వివరాలపై నివేదిక ఇవ్వాలని ఇటీవల సీపీవో, ఇంజనీరింగ్ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో సదరు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కాని పనులు, ప్రగతిలో ఉన్న పనులు, పూర్తయిన పనుల గురించి ఆరా తీస్తున్నారు. ఆ నివేదికను పరిశీలించిన తర్వాత ప్రారంభం కాని పనులను రద్దు చేసి ఎమ్మెల్యేల ద్వారా ప్రతిపాదనలు స్వీకరించి, పనులు చేయాలని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తున్నది.

8న కలెక్టరేట్, రామగుండం మున్సిపల్‌లో 'ప్రజావాణి'

పెద్దపల్లిటౌన్, జనవరి 2: కలెక్టరేట్‌తో పాటు రామగుండం మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 8న ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు జిల్లాకేంద్రంలో, రామగుండం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు తెలుపుతూ అర్జీలను సమర్పించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అధికారులు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో, రామగుండం కార్పొరేషన్ పరిధిలోని అధికారులు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో పది గంటల నుంచి అందుబాటులో ఉండే విధంగా సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

బంకుల వద్ద బారులు తీరిన వాహనదారులు



పెట్రోల్ బంక్ వద్ద వాహనదారుల రద్దీ

కళ్యాణ్‌నగర్, జనవరి 2: తెలంగాణ వ్యాప్తంగా ఆయిల్ ట్యాంకర్ల యజమానులు సమ్మె చేస్తామని ప్రకటించడంతో గోదావరిఖనిలోని పలు బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. స్టాక్ ఉన్న బంకుల వద్ద పెద్దఎత్తున వాహనదారులు బారులు తీరారు. ఆయిల్ ట్యాంకర్ల యజమానులు సమ్మె విరమించామని ప్రకటించినప్పటికీ బుధవారం నుంచి మూడు రోజుల పాటు సమ్మె ఉంటుందని సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో వాహనాలు పెట్రోల్ కోసం పరుగులు తీశారు. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కఠిన నిబంధనలు చేర్చడంతో ట్యాంకర్లు, ట్రక్కుల యజమానులు సమ్మెకు దిగుతామని హెచ్చరించడంతో కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు కొత్త చట్టాన్ని వెనక్కి తీసుకుంది. దీంతో ఆయిల్ ట్యాంకర్ల యజమానులు సమ్మె ఆలోచనను విరమించుకున్నారు.

'ఆపరేషన్ స్మైల్'ను విజయవంతం చేయాలి

- సమీక్ష సమావేశంలో ఏసీపీ వెంకటేశ్వర్లు



ఆపరేషన్ స్మైల్ పోస్టర్‌ను ఆవిష్కరిసున్న ఏసీపీ వెంకటేశ్వర్లు



సమావేశానికి హాజరైన అధికారులు

కోల్‌సిటీ, జనవరి 2: బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ స్మైల్-10ను విజయవంతం చేద్దామని ఏసీపీ చిలుకూరి వెంకటేశ్వర్లు కోరారు. కమిషనరేట్‌లో మంగళవారం కార్మిక, పోలీస్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, బాలల శాఖ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన శాఖ, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బాల్యం అమూల్యమైనదని, దానిని అనుభవించడం ప్రతి పౌరుడి హక్కు అన్నారు. కొందరు పిల్లలు క్షణికావేశంలో తల్లిదండ్రులను విడిచి దూరంగా ఉంటున్నారని, ఈ అవకాశాన్ని ఆసరగా చేసుకుని కొందరు స్వార్థపరులు వారితో పనులు చేయిస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తప్పిపోయిన పిల్లలను వెతికి దర్పణ్ అప్లికేషన్ ద్వారా వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పర్చాలని, వారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చి శోకాన్ని తీర్చాలన్నారు. బిక్షాటన చేస్తున్న వారి గురించి, బాల కార్మికుల గురించి సమాచారం ఇవ్వడానికి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 112 నంబర్లపై ఉచిత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రతి పోలీస్ సబ్ డివిజన్‌లో ఒక ఎస్ఐతో పాటు నలుగురు సిబ్బంది, వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఈనెల 31వరకు ఆపరేషన్ స్మైల్ పేరిట స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ట్రాఫిక్ జంక్షన్లు, క్షుణ్ణంగా తనిఖీ చేసి వారి తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు.

ఈ సమావేశంలో బాల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ శ్రీధర్, వహీద్, జిల్లా సంక్షేమాధికారులు రవూఫ్ ఖాన్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ - ప్రజాపాలన కార్యక్రమంలో రైతులకు హామీ..



పత్తిపాకలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, జనవరి 2: సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ రైతులకు హామీ ఇచ్చారు. మంగళవారం ధర్మారం మండలం పత్తిపాకలో ప్రజాపాలన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న సాగు నీటి సమస్యను తీర్చడం కోసం సంబంధిత ఎస్సారెస్పీ జిల్లా అధికారులతో సమీక్షించి క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నట్టు ఆయన చెప్పారు. పత్తిపాక, నర్సింగాపూర్ గ్రామాలకు సాగునీటి సమస్యను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసువెళ్తానని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఎస్సారెస్పీ కాలువ నిర్మాణానికి నిధుల మంజూరు కోసం సీఎం రెవంత్‌రెడ్డిని కలుస్తామని ఆయన అన్నారు. అదేవిధంగా పత్తిపాక, నర్సింగాపూర్ గ్రామాల శివారులో గల ప్రభుత్వ భూములను అర్హులైన పేదలందరికి భూపంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ భూములను ఆక్రమించకున్న వారిలో అర్హులకు మినహా, అనర్హులకు కేటాయించిన పట్టాను రద్దు చేసి అర్హులైన పేదలకు పంపిణీ చేసేలా కలెక్టర్‌కు నివేదించినట్టు ఆయన తెలిపారు. పూర్తి నివేదిక వచ్చిన తర్వాత క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తామని కలెక్టర్ చెప్పారని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీ పథకాలను ప్రజలు సద్వినిమోగం చేసుకోవాలని ఆయన కోరారు. పార్టీలకతీతంగా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఇందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.జయశీల, తహసీల్దార్ ఏ. రజిత, సర్పంచ్ బద్దం సుజాత, ఎంపీటీసీ సభ్యుడు బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, స్థానిక నాయకులు రాజేందర్, రవీందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అడ్లూరి పూజలు..

మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో గల అభయ కృష్ణ ఆలయంలో మంగళవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూజలు నిర్వహించారు. ఆలయంలో అభయ కృష్ణుడికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కౌంటర్లు పెంచాలి

- ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జనవరి 2: పేషెంట్ల రిజిస్ట్రేషన్ కౌంటర్లు పెంచి వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చే పేషెంట్ లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మంగళవారం కలెక్టర్ జిల్లా కేంద్రంలోని మాతా, శిశు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న ప్రసూతి ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్, పోస్ట్ ఆపరేటివ్ వార్డు, వివిధ బ్లాక్ లను పరిశీలించారు. పేషెంట్‌లకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా మెరుగైన వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రులు అందిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసుపత్రిలో పేషంట్ల రిజిస్ట్రేషన్ వద్ద ఎదురు చూస్తున్న రోగుల సంఖ్య అధికంగా ఉండటంతో అదనపు కౌంటర్లు ఏర్పాటుచేయాలని, ఆసుపత్రిలో మందుల డబ్బాలను ఫార్మసీ స్టోర్‌లో భద్రపర్చాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్‌లు, వారి సహాయకులతో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సానుకూలంగా స్పందించాలని, వారితో ఓపికగా వ్యవహరించాలని, మెరుగైన వైద్య సేవలందించే దిశగా కృషి చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, డాక్టర్ శౌరయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీవో 317ను సవరించాలని ఎమ్మెలేకు వినతి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 2: జీవో నంబరు 317ను సవరించాలని కోరుతూ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ప్రభుత్వ ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు సన్మానించారు. గత ప్రభుత్వం 2022లో 317 జీవో తీసుకువచ్చి వేరే జిల్లాలో ఉన్న తమకు పెద్దపల్లి జిల్లాకు కేటాయించారన్నారు. 317జీవోతో గత ప్రభుత్వం స్థానికతను విస్మరించి క్యాడర్ సీనియార్టీ పరిగణనలోకి తీసుకున్నారని వివరించారు. తెలంగాణలో స్థానికేతరులమైన మేము కాల్వశ్రీరాంపూర్‌లో పనిచేస్తూ అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. జీవో నంబరు 317ను సవరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ / केनरा बैंक / Canara Bank
A Government of India Undertaking
Together We Can

కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీ
ఆంధ్రజ్యోతి ABN

అందమైన ముగ్గులు వేయండి.. ఆనందంగా బహుమతులు అందుకోండి..
రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.1,50,000/-లకు పైగా బహుమతులు.

మొదటి బహుమతి రూ.6000/-
రెండో బహుమతి రూ.4000/-
మూడో బహుమతి రూ.3000/-

నిబంధనలు: మహిళలు మాత్రమే పాల్గొనాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ముగ్గు, రంగులు ఎవరికి వారే తెచ్చుకోవాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం 2 గంటలు

పోటీలు జరిగే ప్రదేశాలు :
కరీంనగర్ : స్థలం: వాణినికేతన్ హై స్కూల్, ముకరంపుర, కరీంనగర్ వివరాలకు: సెల్: 9985411174 తేది: 07-01-2024, ఆదివారం రోజున సమయం: ఉదయం: 10 గం॥ల నుండి
రాజన్న సిరిసిల్ల : స్థలం: రాజశ్రీ ఫంక్షన్ హాల్, మల్లారం రోడ్, వేములవాడ, రాజన్న సిరిసిల్ల జిల్లా వివరాలకు: సెల్: 7013840728 తేది: 07-01-2024, ఆదివారం రోజున సమయం: ఉదయం: 10 గం॥ల నుండి
జగిత్యాల : స్థలం: జ్యోతి హై స్కూల్, రాంబజార్, పురాణిపేట, జగిత్యాల. వివరాలకు: సెల్: 9393551919, 9985411297 తేది: 07-01-2024, ఆదివారం రోజున సమయం: ఉదయం: 10 గం॥ల నుండి

పెద్దపల్లి : స్పాన్సర్స్: మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాల పెద్దపల్లి.
స్థలం: వ్యవసాయ మార్కెట్ యార్డ్
వివరాలకు : సెల్: 9985411296
తేది: 06-01-2024, శనివారం రోజున
సమయం: ఉదయం: 10 గం॥ల నుండి..

సంతోషాల వసంతం, మీ ముంగిట
8.40% 8.70%
1800 1030

Powered By
AIMS INSTITUTES Peenya, Bangalore
PROGRAMMES OFFERED
MBA | MBA In France | PGDM | BBA | BBA (Aviation)
BCOM | MCOM | MFA (Financial Analysis) | DIPLOMA Swiss Professional Diplomas in Hospitality (Culinary / Food & Beverage / Rooms service)
BCA | MCA | BHM
MSW | PUC (PCMB/PCMC/CEBA)
AIMS Institutes: 1st Cross, 1st Stage, Peenya, Bangalore
+91 81500 01994
www.theaims.ac.in/apply
admission@theaims.ac.in

Real Partner
SWARGASEEMA SUKETANA
DTCP APPROVED
TS RERA P01400006315
KONDURG @SHADNAGAR (HYDERABAD)
DTCP & RERA APPROVED PLOTS
Ph: 9849012500
CALL US FOR FREE SITE VISIT









ఎన్నికల సందర్భంగా ఇంటలిజెన్స్ కమిటీ ఏర్పాటు

● కలెక్టర్ పమేలా సత్పతి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోయే పార్లమెంట్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో చేసిన ఖర్చు, డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతకు సంబంధించిన సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఎన్నికల వ్యయ సున్నితమైన నియోజకవర్గాలు, ప్రాంతాలను గుర్తించుటకు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఇంటలిజెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెకటర్ మాట్లాడుతూ ఈ జిల్లా స్థాయి కమిటీలో జిల్లా రెవెన్యూ శాఖతో పాటు సభ్యులుగా ఉండి గత అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల సమయంలో ఖర్చు చేసిన డబ్బు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ పట్టివేతల సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక ఏర్పాటు చేయాలన్నారు. నివేదిక ఆధారంగానే జిల్లాలోని సున్నితమైన వ్యయ అసెంబ్లీ నియోజకవర్గాలు, ప్రాంతాలను ఎన్నికల సంఘం గుర్తించి తదనుగుణంగానే, వాటిని ప్రత్యేకంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్ కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు, ఏసీపీ పి కిష్టయ్య, ఇన్‌కంటాక్స్ అధికారి ఆర్ రాజేష్, జీఎస్టీ అధికారి వి మధునయ్య, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు, ఎలక్షన్ డీటీలు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌యూ ఎంఈడీ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జనవరి 2: ఎస్‌యూ పరిధిలోని ఎంఈడీ రెండో సెమిస్టర్, బీ ఫార్మసీ మొదటి, రెండు, మూడు, నాలుగో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.వీ.శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

'కరీంనగర్-హసన్‌పర్తి రైల్వేలైన్ పనులు త్వరలో ప్రారంభం'

భగత్‌నగర్, జనవరి 2: కరీంనగర్-హసన్‌పర్తి రైల్వే లైన్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని పద్మశాలి భవన్‌లో సంఘం కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు తీసుకు వచ్చానన్నారు. ప్రజల కోరిక మేరకు కరీంనగర్-హసన్‌పర్తి కొత్త రైల్వే లైన్‌కు సంబంధించిన సర్వే పనులు పూర్తి కాబోతున్నాయన్నారు. ఒక వర్గం ఓట్ల కోసం పాకులాడితే 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచేవాడినన్నారు. తనకు ధర్మమే ముఖ్యమని, హిందు ధర్మ రక్షణ కోసం ఎంతవరకైనా వెళతా.. కానీ ఓట్లకోసం పాకులాడేది లేదన్నారు. రాష్ట్రంలో కుల వృత్తులు,కుల సంఘాల అభ్యున్నతికి పైసలిచ్చేందుకు వెనుకాడే రాష్ట్ర ప్రభుత్వం ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్న, మత మార్పిడులను ప్రోత్సహిస్తున్న తబ్లిగ్‌జమాతే వంటి సంస్థలు నిర్వహించే సభలు సమావేశాలకు రూ.3 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా హిందుసమాజం సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశం సురక్షితంగా ఉండాలంటే ప్రజలకు ఉపయోగపడే చట్టాలు కార్యరూపం దాల్చాలంటే బీజేపీ గెలుపు అనివార్యమన్నారు. భారత పౌరులంతా దేశంలో ఎక్కడికైనా వెళ్లి స్థలం కొనుక్కొని ఇల్లుకట్టుకుని నివసించే అవకాశం ఉంటుందని, వివాహాలు చేసుకునే అవకాశం ఉందని, కశ్మీర్‌లో మాత్రం అవకాశం లేకుండా కాంగ్రెస్ పాలకులు చేశారన్నారు.














బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బోనంతో బారులుదీరిన భక్తులు

వేములవాడ, జనవరి 2: రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం నాడు భక్తులతో రద్దీగా మారింది. సోమవారం నాడు తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆనవాయితీ ప్రకారం మంగళవారం నాడు బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

రాజన్న ఆలయానికి అదనపు భద్రత

- 11 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది కేటాయింపు - మహాశివరాత్రి వరకు విధులు నిర్వహించనున్న సిబ్బంది



వేములవాడ చేరుకున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

వేములవాడ, జనవరి 2: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి అధికారులు అదనపు భద్రత కల్పించారు. రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం భద్రత కోసం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) విభాగానికి చెందిన సిబ్బంది భద్రతను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరు హెడ్‌కానిస్టేబు ల్స్, పదిమంది పోలీస్ కానిస్టేబుల్‌లతో కలిపి మొత్తం 12 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరిలో మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర జరగనున్న తరుణంలో కొద్ది వారాలుగా వేములవాడ రాజన్న ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునే ఆనవాయితీలో భాగంగా భక్తులు పెద్దసంఖ్యలో వేములవాడకు వస్తుండడంతో ఆలయానికి అదనపు భద్రత కల్పించాలని కోరుతూ ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ ఉన్నతాధికారులను కోరారు. దీంతో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగం నుంచి ఒక ఏఎస్ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్, ఎనిమిది మంది కానిస్టేబుల్స్‌ను రాజన్న ఆలయానికి అదనంగా కేటాయించారు. మార్చి 7, 8, 9వ తేదీల్లో జరగనున్న మహాశివరాత్రి జాతర వరకు అదనపు సిబ్బంది భద్రతా విధుల్లో పాల్గొంటారని ఆలయ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఆలయంలో భద్రతా విధులు నిర్వహిస్తున్న 12 మంది ఎస్పీఎఫ్ సిబ్బందికి మరో పదకొండు మంది అదనంగా వచ్చి చేరడంతో మొత్తం ఎస్పీఎఫ్ భద్రత సిబ్బంది సంఖ్య 23 కు చేరుకుంది. వీరికి అదనంగా 33 మంది హోంగార్డులు కూడా ఆలయ భద్రత విధుల్లో పాల్గొంటున్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



తాల్ల శృతి



కోనేటి అభినవ్

తిమ్మాపూర్, జనవరి 2: మండలంలోని మొగిళిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తాల్ల శృతి, కోనేటి అభినవ్ ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. తొర్రూరు జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ అండర్ 17పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి ఈనెల 3 నుంచి 6వ తేది వరకు ఛత్తీస్‌గడ్ రాష్ట్రం, బిలాస్పూర్‌లో జరగనున్న 67వ జాతీయస్థాయి పోటీల్లో ఇద్దరు విద్యార్థులు పాల్గొంటున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, పీఈటీ ఆడెపు శ్రీనివాస్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ సుస్మితారెడ్డి, ఎంపీటీసీ తిలక్ ప్రియా రెడ్డి, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జనవరి 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,800 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 70మంది రైతులు 669 క్వింటాళ్లు విడి పత్తి, ఆరుగురు రైతులు గోనె సంచుల్లో ఏడు క్వింటాళ్లు విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,800 రూపాయలు, కనిష్ఠ ధర 5,400 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, జనవరి 2: స్థానిక ఎస్‌బీఐ ఆర్‌సెటి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో జనరల్ ఈడీపీ(వ్యాపార నైపుణ్యాభివృద్ధి)లో ఈ నెల 8 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభం కానున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 18-45 సంవత్సరాలు గల గ్రామీణ పురుషులు దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు 9949448197, 9849411002 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వారిపై కేసు

తిమ్మాపూర్, జనవరి 2: డిసెంబరు 31న రాత్రి విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన నాలుగురిపై ఎల్ఎండి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు. ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ కార్పోరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌లో డిసెంబరు 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటలను చోటు చేసుకోకుండా ఎల్ఎండి పోలీసులు, క్విక్ రెస్పాన్స్‌టీ(క్యూఆర్‌సి) పోలీసులు విధులు నిర్వర్తిస్తుండగా అలుగునూర్‌కి చెందిన కొందరు టాపాసులు పెల్చుతు, కేక్ కట్ చేస్తుండగా దాన్ని పోలీసులు అడ్డుకునేందకు ప్రయాత్నం చేసి టాపాసులు పేల్చవద్దని ఆదేశించారు. అయిన వారు వినకుండా విధుల్లో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తిస్తు, దుర్భషాలాడారు. దీంతో అలుగునూర్‌కి చెందిన గోపు మల్లారెడ్డి, బైరీ రాజు, బుర్ర లక్ష్మణ్, రమేష్ నలుగురిపై సెక్షన్ 294, 353 కింద సోమవారం కేసులు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

శంకరపట్నం, జనవరి 2: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో ఇటీవల ఓ వృద్ధుడు తప్పిపోయి శవంగా లభ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం డిసెంబరు 15న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన బండారి భూమయ్య (80) అనే వృద్ధుడు కనిపించకుండా పోయాడు. దీంతో మృతుడి కూతురు బాడిష సుజాత గత నెల 18న కేశవపట్నం పోలీస్ స్టేషన్లో తన తండ్రి భూమయ్య కనబడడం లేదని ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నూతన సంవత్సరం నాడు కరీంపేట గ్రామంలో వృద్ధుడి శవం వ్యవసాయ భూమి పొదల పక్కన పడి ఉందని సమాచారం వచ్చింది. దీంతో మృతుడి కూతురు వెళ్లి చూడగా తన తండ్రిదేనని గుర్తించింది. తన తండ్రి మతిస్థిమితం లేక తిరుగుతూ కరీంపేట గ్రామ శివారులోని ఓ కౌలు రైతు పొలంలో పడిపోయి మృతి చెందాడని, ఎవరిపై అనుమానం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బిర్యాని సెంటర్‌పై దాడి కేసులో ఐదుగురి రిమాండ్

జమ్మికుంట, జనవరి 2: జమ్మికుంట పట్టణంలోని ఓ బిర్యాని సెంటర్‌పై దాడి చేసి, ఫర్నీచర్ ధ్వంసం చేసిన సంఘటనలో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, సీఐ బర్పటి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 31న బిర్యాని సెంటర్‌కు వచ్చిన ఐదుగురు యువకులు, సిబ్బంది మధ్య జరిగిన వాగ్వాదం జరగగా యువకుడు ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. హోటల్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పి అరవింద్, జి రాజు, పి హరీష్, పి సాగర్, పి అనిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

కెమెరా దొంగిలించిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 2: కలెక్టరేట్ ఎదుట నాలుగు రోజుల క్రితం ఒక కెమెరామెన్ బ్యాగ్ చోరీకి గురి కాగా పోలీసులు మంగళవారం నిందితుడిని పట్టుకుని వీడియో కెమెరాతో పాటు అందులోని పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు కరీంనగర్ ఏసీపీ జి నరేందర్ విలేకరుల సమావేశంలో తెలిపారు. కట్టరాంపూర్‌కు చెందిన జునుగారి శంకర్ కూలి పనిచేస్తూ తాగుడుకు బానిసగా మారాడని, మద్యం కోసం డబ్బులు లేక డిసెంబరు 30న కలెక్టరేట్ ఎదుట బైక్‌పై కనబడిన కెమెరా బ్యాగును ఎత్తుకెళ్లాడని ఏసీపీ తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా నిందితుడి కోసం గాలిస్తుండగా మంగళవారం అంబేద్కర్ స్టేడియం వద్ద శంకర్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా బ్యాగును ఎత్తుకెళ్లిన నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడు గతంలో ఏడు నేర ఘటనలకు పాల్పడినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేయించాలి

- జనవరి చివరిలోగా రోడ్ల మరమ్మతులు - ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



దెబ్బతిన్న కల్వర్టును పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

రాయికల్, జనవరి 2: ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి కొత్తగా రేషన్‌కార్డులు కావాలనుకున్నవారి నుంచి దరఖాస్తులు చేయించాలని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలోని బోర్నపెల్లి, భూపతిపూర్, వీరాపూర్ తదితర గ్రామాల్లో ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. భూపతిపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని అప్లికేషన్ పత్రంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బోర్నపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ఎత్తిపోతల పంపులను పరిశీలించి త్వరలోనే శుద్ధి నీరు అందజేస్తామని తెలిపారు. బోర్నపల్లి గ్రామంలో ఇటీవల ఇల్లు కాలిపోయిన భారతపు లక్ష్మీనర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించడంతో పాటు అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి వచ్చే సహాయాన్ని అందించాలని సూచించారు. రామాజీపేట నుంచి వీరాపూర్, వీరాపూర్ నుంచి రాయికల్ ఎక్స్ రోడ్డులో కల్వర్టు చెడిపోవడంతో మరమ్మతులు చేపట్టకపోవడంతో వీరాపూర్, రామాజీపేట గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, రెన్యూవల్ బ్రిడ్జి మంజూరై టెండర్ కూడా పూర్తయినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరలో కొత్త వంతెన నిర్మాణం చేపట్టి భవిష్యత్‌లో ఎప్పుడూ ఎలాంటి ఆటంకాలు రాకుండా చూస్తామన్నారు. గత వర్షాకాలంలో భారీ వర్షానికి రోడ్డు కోతకు గురై ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా సమస్యను జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్సీ తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీరాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు సోమ వెంకటేష్, సుందరగిరి గంగాధర్, దుంపల నర్సారెడ్డి, భూపతిపూర్ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, జక్కుల సాగర్ విష్ణు, శేఖర్ రెడ్డి, నాగరాజు, రాజు, సంతోష్, నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల తగ్గింపు

జగిత్యాల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎస్‌ఆర్‌ఎస్‌పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా సరఫరా చేస్తున్న నీటి విడుదలను మంగళవారం అధికారులు తగ్గించారు. ఇప్పటివరకు 6 వేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేస్తున్నారు. కొద్ది కొద్దిగా 3,500 క్యూసెక్కులకు తగ్గిస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యామ్‌లో 70.67 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 79.621 టీఎంసీల నీరు ఉంది.

ప్రాజెక్టు నుంచి 7,983 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు ఆరు వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 472 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత యేడాది జూన్ ఒకటవ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 200.682 టీఎంసీల నీరు రాగా, 150.917 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

కిరాణా షాపు దగ్ధం

మల్లాపూర్, జనవరి 2: షార్ట్ సర్క్యూట్‌తో మండల కేంద్రంలోని కస్తూరి సంతోష్‌కుమార్‌కు చెందిన కిరాణా షాపు దగ్ధమైంది. మంగళవారం కిరాణం షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో స్థానికుల సహాయంతో మంటలను ఆర్పి వేశారు. అప్పటికే షాపులోని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంతో రూ. 3లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు సంతోష్ తెలిపారు. ప్రభుత్వం సహాయం అందించాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మారుతి(ఫైల్)

రాయికల్, జనవరి 2: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన దాసరి మారుతి (24) ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు కింద పడి మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మారుతి తన స్నేహితుడు సింగం నరేష్‌తో కలిసి మంగళవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో మైతాపూర్ నుంచి అల్లీపూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాయికల్ తహసీల్దార్ కార్యాలయం మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి దగ్గరలోని ఇంటికి గల షట్టర్స్‌ను ఢీకొట్టి కింద పడ్డారు. దీంతో మారుతి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న నరేష్‌కు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. మారుతి తండ్రి రాజరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

● బైక్ అదుపు తప్పి మరో యువకుడు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కథలాపూర్: నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని తన స్నేహితున్ని పక్కన గ్రామంలో దించి కోరుట్లకు వెళ్తున్న యువకుడు బైక్ అదుపు తప్పి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. భీమారం మండలం పసునూరుకు చెందిన జెల్లంకి అభిలాష్ (21) గత నెల 31న స్నేహితులతో కలిసి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నాడు. పక్కనే ఉన్న రాజలింగంపేటలో తన స్నేహితున్ని దించి పనిమీద కోరుట్లకు బయలు దేరాడు. టీఎస్ 02 ఈపీ 1941 నంబర్ గల బైక్‌పై వెళ్తున్న క్రమంలో మండలంలోని గంభీర్‌పూర్ శివారులో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలో పడ్డాడు. గోతిలో నీళ్లు ఉండడంతో మునిగి చనిపోయాడు. రెండు రోజుల నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో అభిలాష్ జాడ కుటుంబ సభ్యులకు తెలియలేదు. మంగళవారం అటువైపు వెళ్తున్న రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పబ్బ కిరణ్‌కుమార్ పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు.



ఇబ్రహీం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మహేష్

గంభీరావుపేట, జనవరి 2: గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన ఎండీ ఇబ్రహీం (55) అనే వ్యక్తి నమాజ్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం.. ఇబ్రహీం గేదెల వ్యాపారం చేసుకుంటూ జీవించేవాడు. నాలుగేళ్ల కిందట పక్షవాతం వచ్చి అనారోగ్యానికి గురయ్యాడు. కర్ర సాయంతో జీవనం సాగిస్తువచ్చాడు. ఆరోగ్యం సహకరించక పోవడం, ఎవ రూ పట్టించుకోక పోవడంతో మానసికంగా కుంగిపోయేవాడు. ఇటీవల, పిల్లలతో సహా భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో ఇబ్రహీం మరింత మానసిక వేదనకు లోనయ్యాడు. బీడీలు తెచ్చుకుంటానని చెప్పి సోమవారం సాయంత్రం ఇంట్లో నుం చి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాక పోవడంతో బంధువులు వెతికారు. మంగళవారం గ్రామ సమీపంలోని నమాజ్ చెరువులో శవమై తేలాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఒడ్నాల పరమేశ్వర్ (53) అనే చిరువ్యాపారి మంగళవారం కొత్త చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం... రాజీవ్‌నగర్‌కు చెందిన పరమేశ్వర్ దుస్తులు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. మూడేళ్ల క్రితం అతడి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో మానసికంగా ఆందోళనకు గురయ్యాడు. తాగుడుకు బానిసై వ్యాపారం తగ్గించాడు. మరోవైపు రూ. 2లక్షల అప్పులు అయ్యాయి. వివాహం చేయాల్సిన కూతురు ఉంది. జీవనోపాధికి సిరిసిల్లలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద పరమేశ్వర్ ఇటీవల చాయ్ హోటల్ ఏర్పాటు చేశాడు. సక్రమంగా నడవకపోవడంతో మనస్తాపం చెందాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయల్దేరి కొత్త చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడే ఉన్న వాచ్‌మెన్ ఫోన్ తీసుకొని భార్య కృష్ణవేణికి కాల్ చేశాడు. తాను చెరువులో దూకి చనిపోతున్నాని, కాపాడుకోమని పెట్టేశాడు. అక్కడే ఉన్న వాచ్‌మెన్ అతడిని వారించినా వినిపించుకోకుండా చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే పరమేశ్వర్ భార్యకు ఫోన్ చేసి వాచ్‌మెన్ విషయం చెప్పాడు. తనకు ఈత రాదని వాచ్‌మెన్ పేర్కొన్నాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా పరమేశ్వర్ చెరువులో శవమై కనిపించాడు. కృష్ణవేణి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కరీంనగర్ క్రైం: కరీంనగర్ ముకరంపురకు చెందిన ఎం. వాసంతిశెట్టి(61) అనే వృద్ధురాలు ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. రెండో ఠాణా సీఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని ఒక హోటల్ యజమాని భార్య అయిన వాసంతి కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. ఆమె మానసిక పరిస్థితి సరిగాలేక ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం ఉదయం 11గంటల ప్రాంతంలో వాసంతి తన ఇంటిలోని వంట గదిలోకి వెళ్లి చీరకు నిప్పంటించుకుంది. ఇంట్లో నుంచి పొగ రావడం గమనించిన ఆమె కుటుంబ సభ్యులు, వర్కర్లు బలవంతంగా తలుపులు తెరిచి ఆమెను ఒక ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. రెండేళ్ల కిందట వాసంతిపై గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి వెళ్లి దాడి చేశాడని కేసు నమోదు కాగా పోలీసుల విచారణలో ఎవరు దాడి చేయలేదని వెల్లడైంది. తాజాగా ఆమె ఆత్మహత్యకు పాల్పడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై లోతుగా విచారణ జరుపుతున్నామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరణానికి కారణం తెలుస్తుందని సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కోల్‌సిటీ, జనవరి 2: గోదావరిఖని సప్తగిరికాలనీలో జరిగిన వంచర్ల గంగాధర్‌రావు హత్య కేసులో నిందితుడు చోడ రవితేజ(30)ని మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు పేర్కొన్నారు. గత నెల 31వ తేది రాత్రి చోడ రవితేజ, గంగాధర్‌రావులు గొడవపడ్డారని, డబ్బుల విషయంలో తిట్టుకున్నారన్నారు. రవితేజ వద్ద గంగాధర్‌రావు కూలీగా పని చేస్తున్నాడని, తరచూ డబ్బులు అడుగుతున్నాడనే కోపంతో అతన్ని తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడన్నారు. తీవ్ర రక్తస్రావంతో రవితేజ మరణించాడన్నారు. మృతుడి స్వగ్రామం ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అని తెలిపారు.

మద్యం సీజ్

కరీంనగర్ క్రైం, జనవరి 2: రాంనగర్‌లోని అప్నా వైన్ షాపు పక్కన పర్మిట్‌రూంలో ఎలాంటి అనుమతి లేకుండా అధిక ధరకు మద్యం విక్రయి స్తున్నారని రెండో ఠాణా పోలీసులు తనిఖీలు చేసి 6,130 రూపాయల విలువైన మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. మంగళవారం ఉదయం 5:40 గంటలకు అందిన సమాచారం మేరకు పర్మిట్ రూం వద్ద తనిఖీ చేయగా పర్మిట్ రూం నిర్వాహకులు వల్లకొండ బాపురెడ్డి, భోగ రాజేందర్‌లు అధిక ధరకు మద్యం విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పర్మిట్ రూం నిర్వాహకులు ఇద్దరిపై ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శోకసంద్రమైన జగ్గరావుపల్లి

- స్వగ్రామానికి చేరుకున్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చాడ శివకృష్ణారెడ్డి మృతదేహం

బోయినపల్లి, జనవరి 2: మండలంలోని జగ్గరావుపల్లికి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చాడ శివకృష్ణారెడ్డి (23) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకోగా సీఐఎస్ఎఫ్ అధికారులు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. శివకృష్ణారెడ్డి రాజస్థాన్‌లోని డీవోలిలో 6వ బెటాలియన్‌లో డాక్యుమెంటరీ సెక్యూరిటీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత నెల 16న ప్రమాదవశాత్తు కింద పడడంతో కోమాలోకి వెళ్లాడు. అప్పటినుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివకృష్ణారెడ్డి సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని సీఐఎస్ఎఫ్ అధికారులు స్వగ్రామానికి తీసుకొస్తుండగా మార్గమధ్యమైన కొదురుపాక నుంచి యువకులు బైక్ ర్యాలీతో జగ్గారావుపల్లికి తీసుకోవచ్చారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహంపై పడి బోరున విలపించారు. పార్థివదేహాన్ని చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శివకృష్ణారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. జైపూర్ నుంచి పార్థివ దేహంతో వచ్చిన సీఐఎస్ఎఫ్ అధికారులు మృతుడి యూనిఫామ్‌ను, జాతీయ జెండాను తల్లిదండ్రులకు అప్పగించి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తహసీల్దార్ పుష్పలత, కాంగ్రెస్ జిల్లా టీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్ నివాళులర్పించారు.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

పెద్దమ్మ ఆలయంలో కాత్యాయనిదేవి వ్రతాలు

మెట్‌పల్లి, జనవరి 2: పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో కాత్యాయదేవి సామూహిక వ్రతాలను ఘనంగా భక్తులు చేపట్టారు. మార్గశిర ధనుర్మాసం మంగళవారం సందర్భంగా పెద్దమ్మ ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి, కాత్యాయనిదేవి వ్రతాలు, కుంకుమ పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ అంగరంగ వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం జరిపి లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు జరిపారు. ఆయలంలో సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలను భక్తులచే జరిపించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దత్తత్రేయుని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి, ఐశ్వర్యలక్ష్మి గోశాలలోని ఆవులకు ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సీసీఐకి విక్రయించే రైతులు సమాచారం ఇవ్వాలి

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జమ్మికుంట, జనవరి 2: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి పత్తి విక్రయించే రైతులు మార్కెట్ అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి పద్మావతి అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. 'పత్తి అమ్మకానికి ఆన్‌లైన్ చిక్కులు' అనే కథనం సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితం కావడంతో స్పందించారు. ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి మాట్లాడుతూ రైతులు ఎంత పత్తి అమ్మకానికి తీసుకు వస్తున్నారు, భూమి ఎంత ఉంది, ఆన్‌లైన్‌లో నమోదైన విస్తీర్ణం ఎంత, పత్తి ఎన్ని క్వింటాళ్లు అమ్ముకోవచ్చనే వివరాలను మార్కెట్ అధికారులు వెల్లడిస్తారన్నారు. పత్తి తీసుకు వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో భూమి నమోదై లేకుంటే సీసీఐ కొనుగోలు చేయదని తెలిపారు. రైతులు ఎప్పుడు ఫోన్ చేసినా మార్కెట్ అధికారులు వివరాలు వెల్లడించేందుకు సిద్ధంగా ఉంటారని, రైతులు సహకరించాలని కోరారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I CHILIVERI SAMHITHA W/O CHILIVERI RAJA MALLAIAH R/O H.NO. 8-22 ATHMAKUR (V), METPALLY (M) JAGITHYAL (D) NOW I CHANGED MY NAME AS CHILIVERI SHRUTHI W/O. CHILIVERI RAJA MALLAIAH
AJK-14770

CHANGE OF NAME

★ I, ENAGANDULA SANTHSH, S/O. RAJAIAH, H.NO. 7-55, SUNDARAGIRI, CHIGURUMAMIDI (M), KARIMNAGAR (D). HAVE CHANGED MY NAME AS "ENAGANDULA SANTHOSH" S/O.RAJAIAH.
AJK-14770

కావలెను

★ ★ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000. సంప్ర॥ 7075656208
AJV_164615

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/పేషంట్‌లను / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. ఫోన్:8977639662, 8977639663
AJH-13253

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 99854 10640
జగిత్యాల :- సెల్: 99854 11262
మెట్‌పల్లి :- సెల్: 70131 42966
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238


రూపునారాయణపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు


రామగుండంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మేయర్ అనీల్ కుమార్


మల్లారంలో దరఖాస్తును స్వీకరిస్తున్న ఎంపీపీ శంకర్

పైరవీలకు తావులేకుండా ప్రభుత్వ పథకాలు అమలు

- ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, జనవరి 2 : ఎలాంటి పైరవీలు లేకుండా గ్రామాల్లో నిజమైన నిరుపేదలకే ప్రభుత్వ పథకాలు అమలు అవుతాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం కనగర్తి, రూపు నారాయణపేట, లంబాడ తండాలో ప్రజా పాలన గ్రామసభలను నిర్వహించారు. రూపునారాయణపేటలో నిర్వహించిన గ్రామ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు ఎటువంటి పైరవీలు ఉండవని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలన్నారు. గతంలో మాదిరిగా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం సాధ్యం కాదని, ప్రస్తుతం అమలు చేయబోతున్న ఐదు లక్షల రూపాయల వ్యయం అయ్యే ఇందిరమ్మ ఇండ్లని తెలిపారు. ప్రజలకు పథకాలు మంజూరయ్యే వరకు పూర్తి బాధ్యత మాదేనని, దశలవారీగా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య లక్ష్యమని తెలిపారు. త్వరలోనే పొత్కపల్లి నుంచి రూపునారాయణపేట చివరి వరకు ఈ ఏడాదిలో డబుల్ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మానేరు వాగులపై రూ. 200కోట్ల వ్యయంతో చెక్ డ్యాములు నిర్మిస్తే, వీటిలో ఒకటి మినహా ఎక్కడ చెక్ డ్యాంలు లేవని, ఇవన్నీ నాణ్యత లేకపోవడంతో పేక మేడలా కూలిపోయాయని అన్నారు. ఇక్కడి ఇసుకను అమ్ముకుంటూ తొమ్మిదేళ్లుగా ప్రకృతి సంపదను దోచుకుని వేల కోట్లను అక్రమంగా ఆర్జించారన్నారు. దీంతో మానేరు వాగు పరివాహక ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇక వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలించవద్దని, అలా చేస్తే అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. మొదటిసారిగా వచ్చిన ఎమ్మెల్యేను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేణుక దేవి,సర్పంచులు అంకం రమేష్, కోట దామోదర్ రెడ్డి, గూగుల్ లక్ష్మి వస్త్రం, ప్రత్యేక అధికారులు యాకయ్య, సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాగా, ఎమ్మెల్యేగా చింతకుంట విజయరమణారావు మొదటిసారిగా రూపునారాయణపేటను సందర్శించిన సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తన ఇంటి వద్ద నుంచి గ్రామసభ వరకు డీజే సంగీత, వాయిద్యాలతో కాంగ్రెస్ నాయకులు తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, అంకం రమేష్, బోడకుంట శంకర్, రాగిడి రవీందర్‌రెడ్డి, బొంగోని శ్రీనివాస్‌గౌడ్, రెడ్డి రజినీకాంత్, రైతు మనోజ్ క్రాంతివీర్, రాచర్ల రాకేష్,పడాల రాజు, మార్క సతీష్, ఆసంశెట్టి కృష్ణ,నీర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జనవరి 2 : తెలంగాణలో నూతన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఎలాంటి సమస్యలైనా పరిష్కరించేందుకు, పథకాలను అమలు చేసేందుకు ప్రజల వద్దకే పాలనను అమలుచేసిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. మంగళవారం మండలంలోని సబ్బితం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విజయరమణరావు ప్రారంభించారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులను ఎమ్మెల్యే స్వీకరించారు. ఎమ్మెల్యే గెలుపొందిన తరువాత మొదటిసారి గ్రామానికి రావడంతో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు కందుల అశోక్‌లు గజమాలతో సత్కరించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభయ హస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చుంచు సదయ్య, ఎంపీటీసీ మహేందర్, తహసీల్దార్ రాజ్‌కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. అలాగే రంగాపూర్, తుర్కలమద్దికుంట, కాసుల పల్లి గ్రామాల్లో ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జనవరి 2: మండలంలోని అల్లీపూర్, నీరుకుళ్ల తదితర గ్రామాలలో మంగళవారం ప్రజా పాలన గ్రామ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాలాజీ రావు, ఆయా గ్రామాల సర్పంచులతో పాటు అధికారులు లబ్దిదారుల నుంచి ధరఖాస్తులు తీసుకున్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఏడు, ఎనిమదివ వార్డులలో నిర్వహించిన సదస్సులలో ఆయా వార్డు కౌన్సిలర్లు కూకట్ల గోపి, చింతల సునిత రాజు మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు.

కమాన్‌పూర్, జనవరి 2 : మండలంలోని జూలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రజాపాలన సభను సర్పంచ్ బొల్లపల్లి శంకర్‌గౌడ్ అధ్యక్షతన అధికారులు నిర్వహించారు. ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మంథని డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీడీవో విజయ్‌కుమార్, తహసీల్దార్ మోహన్‌రెడ్డి, సర్పంచ్ బొల్లపల్లి శంకర్‌గౌడ్, ఎంపీటీసీ శేవ్వ శంకరయ్య, అబ్బిడి వినోద్, ఎంపీవో శేషయ్య, సూరి, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంథని/మంథనిరూరల్, జనవరి 2: ప్రభుత్వ 6 గ్యారెంటీ సంక్షేమ పథకాల అమలు కోసం నిర్వహించిన ప్రజాపాలన సదస్సులకు దరఖాస్తుల స్వీకరణ మంగళవారం జరిగింది. మంథని మున్సిపల్ పరిధిలోని 4, 11వ వార్డుల్లో జరిగిన ప్రజాపాలన సదస్సులో అధికారులకు ప్రజలు తమ దరఖాస్తులు సమర్పించారు. 6 గ్యారెంటీ స్కీంలో మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, గృహజ్యోతి, చేయూత పెన్షన్, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్ రూ. 500 గ్యాస్ సిలెండరు లాంటి పథకాల కోసం ప్రజలు తమ దరఖాస్తులను అందజేశారు. మండలంలోని ఆరెంద, మల్లారం, బిట్టుపల్లి, గద్దలపల్లి, పుట్టపాక, నగరంపల్లి, పోతారం, ఉప్పట్ల గ్రామాల్లో జరిగిన


మంథనిలో ప్రజాపాలనను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రజాపాలన సదస్సుల్లో ప్రజలు దరఖాస్తులను అధికారులకు అందజేశారు. మంథని మున్సిపల్ పరిధిలో కమీషనర్ మల్లిఖార్జునస్వామి, సీడీపీవో పద్మశ్రీ, మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీపీ కొండ శంకర్, తహసీల్దార్ రాజయ్య, ఎంపీపీడీ రమేష్‌లు దరఖాస్తులు స్వీరించారు.

ఎలిగేడు, జనవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముప్పిరితోటలో నిర్వహించారు. ప్రజా పాలన గ్రామ సదస్సులో ప్రజల పెద్ద ఎత్తున దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ తిరుపతిరావు, ఎంపీడీవో శ్రీనివాస మూర్తి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య, ఉపసర్పంచ్ చీకటి శైలజ, ఎంపీపీ ఎల్లమ్మ, ఐకేపీ ఏపీఎం సుధాకర్, ఏవో ఉమాపతి, ఏఈలు సంపత్‌రెడ్డి, జగదీశ్వర్, పీహెచ్‌సీ డాక్టర్ నిస్సిక్రిష్టాన, ఆర్ఐ శైలజ, ఏఎన్ఎం, వివోలు, అంగన్వాడీ టీచర్లు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామగిరి, జనవరి 2: మండలంలోని బేగంపేట్, పన్నూరు గ్రామాల్లో ఆరు గ్యారెంటీల పథకాలపై మంగళవారం ప్రజాపాలన సమావేశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ఆరెల్లిదేవక్కతో పాటు స్థానిక ప్రజాప్రతినిధిలు పాల్గొన్నారు. పన్నూరు గ్రామంలో వివిధ పథకాల కోసం 625 మంది లబ్ధిదారులు దరఖాస్తులు, బేగంపేట్‌లో 973 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్‌తో పాటు వివిధ విభాగల అదికారులు పాల్గొన్నారు.

జూలపల్లి, జనవరి 2: మండలంలోని పెద్దాపూర్, కీచులాటపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం అందించనున్నా అభయహస్తం సంక్షేమ పథకాలకు ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారులు డీఈవో మాధవి, రంగారెడ్డి, తహసీల్దార్ బషీరుద్దిన్, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఏఓ ప్రత్యూష, ఏఈలు అశోక్, సువిశాల, సుమలత, ఆర్ఐలు సంపత్‌కుమార్, సదయ్య, పంచాయతీ కార్యదర్శులు రవిందర్, పున్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం, జనవరి 2 : మండలంలో బంజేరుపల్లి, కమ్మరిఖాన్‌పేట, పత్తిపాక, రచ్చపల్లి, రామయ్యపల్లి, పెర్కపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రజా పాలన గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. మండలంలో ఇప్పటి వరకు 22గ్రామాల్లో 13525 అభయహస్తం దరఖాస్తులను ప్రజలు సమర్పించారు. ఈ గ్రామ సభల్లో ఎంపీడీవో బీ జయశీల, తహసీల్దార్ ఏ రజిత, ఎంపీవో రమేష్, సర్పంచ్‌లు, పంచాయతీకార్యదర్శులు పాలొన్నారు.

కోల్‌సిటీ, జనవరి 2: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం 25, 26, 27, 28, 30, 31, 32 డివిజన్లలో ప్రజాపాలన వార్డు సభలు నిర్వహించారు. మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ నాగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు. 30వ డివిజన్‌లో జరిగిన సభలో మేయర్ అనీల్ కుమార్, మాజీ కార్పొరేటర్ బొమ్మక శైలజ దరఖాస్తులు స్వీకరించారు. మంగళవారం ఏడు డివిజన్లలో వార్డు సభలు నిర్వహించగా 7,501 దరఖాస్తులు వచ్చాయి. కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు 31డివిజన్లలో వార్డు సభలు నిర్వహించగా 35,719 కుటుంబాలు భాగస్వాములైనట్టు అధికారులు పేర్కొన్నారు. అభయహస్తం దరఖాస్తులు 25233 వచ్చాయి. వీటితో పాటు రేషన్‌కార్డులు, ఇతర సమస్యలపై కూడా ప్రజలు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఒక కార్పొరేషన్ పరిధిలోనే మంగళవారం నిర్వహించిన సభల్లో 578 ఇతర దరఖాస్తులు వచ్చాయి. తొమ్మిదేళ్లుగా రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ లేకపోవడంతో ప్రజలు రేషన్‌కార్డుల కోసం తెల్లకాగితంపై దరఖాస్తులు రాసి ఇస్తున్నారు.

కాల్వశ్రీరాంపూర్, జనవరి 2: ఈ వేసంగికి రైతుల పంటలకు సాగునీరు అందించి పంటలు కాపాడుతామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాల్వశ్రీరాంపూర్, వెన్నంపల్లి, పెగడపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఆర్ఎస్‌పీ నీరు హుస్సేన్‌మియా వాగు పరివాహక ప్రాంత రైతాంగానికి అందిస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆరు పథకాలపై సంతకం చేశారన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకం, గృహజ్యోతి, చేయూత పథకాల కోసం ప్రభుత్వమే ఇంటింటికి దరఖాస్తులు అందజేసి నింపిన దరఖాస్తులను తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈనెల 6వరకు గ్రామపంచాయతీ కార్యాలయంల్లో, ఆ తదుపరి ఎంపీడీవో కార్యాలయంలో మీ దరఖాస్తులను ఇవ్వవచ్చన్నారు. అదేవిధంగా రాబోయే రబీ పంట సీజన్‌లో ఒక్క గింజ కటింగ్ లేకుండా కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ విషయంపై మిల్లర్లతో సీఎంతో మాట్లాడించి రైతులను ఆదుకుంటామన్నారు. కాగా, కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రి సమస్యలను సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహకు వివరించడం జరిగిందన్నారు. విఠల్‌రెడ్డి డాక్టర్‌గా ఉన్నప్పుడు దవాఖానా బాగా నడిచిందని, ఇప్పుడు ఆ పరిస్థితిలేదని, ఈ విషయంపై దృష్టి సారించాలని ఎమ్మె ల్యేలు పలువురు గ్రామస్థులు సమావేశంలో కోరారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే గత ప్రభుత్వం 30పడకల ఆసుపత్రి ఆరు పడకలు చేయడంతో వైద్య సేవలు కూడా అంతంత మాత్రమే అందుతున్నాయని, ఈ ఆసుపత్రిపై మంత్రికి వివరించానన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొట్టమొదటిగా ప్రభుత్వాసుపత్రి సమస్యలపై మంత్రికి వివరించినట్లు తెలిపారు. ఈ ఆసుపత్రి 30పడకల ఆసుపత్రి అయ్యేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మొదటిసారిగా గ్రామాలకు రావడంతో పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, ఉద్యోగులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్, జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, వైస్ఎంపీపీ జూకంటి శిరీష, సర్పంచ్‌లు ఆడెపు శ్రీదేవిరాజు, ఆరెల్లి సుజాతరమేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు మాదాసి సువర్ణరామచంద్రం, జెట్టి దేవన్న, సుముఖం నిర్మలమల్లారెడ్డి, మండల ప్రత్యేకాధికారి ఆదిరెడ్డి, తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీడీవో రాంమోహనచారి, ఎంపీవో గోవర్ధన్, ఏవో నాగార్జున, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ ఉద్యోగులు పాల్గొన్నారు.


పన్నూర్ దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీపీ


సబ్బితంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే


జూలపల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

పోరాట యోధుడు బర్దన్

- సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు


నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కళ్యాణ్‌నగర్, జనవరి 2: పోరాట యోధుడు ఏబీ బర్దన్ అని, ఆయన ఆశయ సాధనను కొనసాగించాలని సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజు, గౌతం గోవర్ధన్ పిలుపునిచ్చారు. బర్దన్ వర్ధంతి సందర్భంగా మంగళవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బర్దన్ కార్మిక నేతగా పలు ఉద్యమాలు చేపట్టి ఐదు సంవత్సరాలకుపైగా జైలు జీవితం గడిపారని చెప్పారు. నాగపూర్‌లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ఆయన 1990లో దేశ రాజకీయాల్లోకి వచ్చారని, యూపీఏ-1 సంకీర్ణ ప్రభుత్వంలో బర్దన్ కీలకపాత్ర పోషించారని చెప్పారు. గోషిక మోహన్, కన్నం లక్ష్మీనారాయణ, తాళ్లపెల్లి మల్లయ్య, శంకర్, ఓదమ్మ, రమ, కనకయ్య, మార్కపురి సూర్య, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య తలంబ్రాల శోభాయాత్ర

మంథని, జనవరి 2: అయోధ్య శ్రీరామాలయ ఆవిష్కరణ మహోత్సవానికి సంబంధించిన తలంబ్రాలను మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్‌లోని శ్రీసీతారామాలయానికి ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో పురవీధుల్లో మంగళవారం వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ మందిర అయోధ్య తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య నుంచి ప్రత్యేకంగా వచ్చిన తలంబ్రాలకు స్థానిక శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయం నుంచి భక్తుల కోలాటాలు, మేళతాళాల మధ్య పట్టణంలో ఊరేగించి ఆలయానికి శ్రీరాంనగర్‌లోని శ్రీసీతారామాలయానికి చేర్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : అయోధ్యలోని శ్రీరాముడి అక్షింతలకు పూజలు నిర్వహించారు. సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో ఉన్న అక్షింతలను ప్రత్యేక పూజల అనంతరం మంగళవారం సాయంత్రం గర్రెపల్లి గ్రామస్తులు తమ గ్రామానికి మంగళవాయిద్యాలతో తీసుకెళ్లారు. సర్పంచ్ వీరగోని సుజాత రమేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ పులి వెంకటేశం, అంజయ్య పటేల్, శ్రీనివాసాచార్యులు, సాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని అందుగులపల్లిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం గడపగడపకు అయోధ్య రాముల వారి అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కారే శారద-శ్రీనివాస్, వీహెచ్‌పీ నాయకులు ఇట్యాల లక్ష్మయ్య, ఇట్యాల అనిల్, శిలారపు అనిల్, హరీష్, దామ అనిల్, సదయ్య, హరీష్, నక్క సంతోష్, రమేష్, పవన్, నక్క రాజేష్, సిద్ధ గట్టయ్య పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాలపై ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న కళాకారులు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 2: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాటల ద్వారా పథకాలను ప్రచారం చేస్తున్నారు. మంగళవారం కాల్వశ్రీరాంపూర్, వెన్నంపల్లి, పెగడపల్లి గ్రామాల్లో పాటల ద్వారా మహాలక్ష్మి పథకం, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలపై ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజలకు పాటల ద్వారా అవగాహన కల్పించారు. కళాకారులు ఇల్లందుల మల్లేష్, బుర్ర శంకర్ గౌడ్, కోంగ్ర వెంకన్న, స్నేహలత, రాజన్న, శ్రావణ్, శ్రీనివాస్, సరిత, రేణుక, శ్రీవల్లి పాల్గొన్నారు.



'అక్రమ బదిలీని ఉప సంహరించుకోవాలి'

శ్రీరాంపూర్, జనవరి 2: మందమర్రి ఏరియా కేకే 5 గనిలో ఓవర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ బదిలీని నిలిపివేయాలని మైనింగ్ సిబ్బంది, కార్మికులు కోరారు. బదిలీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్కె 7 గనిపై నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఏఐటీయూసీ యూనియన్‌కు మద్దతు ఇవ్వలేదని ఆయనపై కక్షగట్టి కేకే 5 నుంచి కాసిపేట గనికి బదిలీ చేయించారన్నారు. ఇలాంటి చర్యలు యాజమాన్యం వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో దశలవారీగా అన్ని ఏరియాల్లో ఆందోళనలు చేపడతామని సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి అనిల్, రాకేష్, ప్రవీణ్, భగవాన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎండీ శ్రీధర్ బదిలీపై బీఎంఎస్ ఆధ్వర్యంలో సంబరాలు


'ఖని'లో చౌరస్తాలో సంబరాలు నిర్వహిస్తున్న బీఎంఎస్ నాయకులు

గోదావరిఖని, జనవరి 2: సింగరేణిలో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ సీఎండీ శ్రీధర్ ఎట్టకేలకు బదిలీ అయ్యారని, బీఎంఎస్ పోరాటం వల్లనే సీఎండీకి బదిలీ అయ్యారని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. మంగళవారం గోదావరిఖని చౌరస్తాలో బీఎంఎస్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. 11సంవత్సరాలుగా సింగరేణిలో తిష్ఠవేసి చట్ట వ్యతిరేకంగా పని చేశారని, కోట్లాది రూపాయల కుంభకోణాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. సింగరేణి పరిశ్రమను రక్షించుకోవడానికి, కార్మికుల హక్కులను సంరక్షించుకోవడానికి బీఎంఎస్ న్యాయపోరాటంతోనే శ్రీధర్‌ను బదిలీ చేశారని తమను రెండు నెలలు మానసిక వేధింపులకు గురిచేయడంతో పాటు చార్జిషీట్లు ఇచ్చారని, ఇంక్రిమెంట్ల కోత విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీధర్ చేసిన అవినీతి, కుంభకోణాలపై సీబీఐచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై సారంగపాణి, సాయవేన సతీష్, లక్ష్మయ్య, భాస్కర్, శ్రీనివాస్, కోటయ్య, మల్లేషం, గుండబోయిన భూమయ్య, నగేష్, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల కార్యవర్గం ఎన్నిక

సుల్తానాబాద్, జనవరి 2: సుల్తానాబాద్ పట్టణ లోకల్ ఆటో డ్రైవర్ల నూతన కార్యవర్గంను మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గుర్రం రాజయ్య, అధ్యక్షులుగా పల్లె శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పల్లె వినయ్, దివాకర్, ప్రధాన కార్యదర్శి గా దండుగల ఐలయ్య, సహాయ కార్యదర్శిగా రౌతు వెంకటేశ్, కోశాధికారిగా దేశెట్టి రమేష్ ఎన్నికయ్యారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ దీనాకుమారి

ధర్మారం, జనవరి2: మండల కేంద్రంలో గల ఆదర్శ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ చదువుతున్న ఎం.శ్రావ్య జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 5నుంచి 9వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రం జట్టు తరపున పాల్గొననుంది. ఈసందర్భంగా ఎం.శ్రావ్యతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి వివిధ పోటీలలో ప్రతిభ కనబర్చిన 30మంది క్రీడాకారులను మంగళవారం జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ షేక్, కళాశాల ప్రిన్సిపాల్ దీనాకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు బైకాని కొంరయ్య, సంజీవరావు తదితరులు అభినందించారు.

మధ్యాహ్న భోజన బియ్యంలో పురుగులు

-ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు


బియ్యంలో వచ్చిన పురుగులు

పెద్దపల్లి రూరల్, జనవరి 2: పెద్దపల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు 10 రోజులు క్రితం పాఠశాలకు పంపించిన బియ్యం బస్తాల నుంచి బియ్యం తీయగా అందులో తెల్ల పురుగులు దర్శనమిచ్చాయి. దీంతో మధ్యాహ్న భోజన వర్కర్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించారు. బియ్యంలో పురుగుల విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. చిన్నారులు తినే బియ్యంలో పురుగులు రావడం పట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని వారు కోరుతున్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం

మంథని, జనవరి 2: మంథని డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏర్పాటు చేసుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జంజర్ల శేఖర్, అధ్యక్షుడిగా పినగాని శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చిట్టిమెల్ల సంతోష్, ఉపాధ్యక్షులుగా మాచీడి కిరణ్, జగన్‌గౌడ్, కోశాధికారిగా మాచీడి రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా రావికంటి సతీష్, కార్యవర్గ సభ్యులుగా మూగ శ్రీకాంత్, శివప్రసాద్, తూర్పాటి రాము, మాచీడి ప్రదీప్, పెరుగు రాకేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేటీఆర్‌ను కలిసిన పుట్ట మధు


కేటీఆర్‌కు మొక్కను అందజేస్తున్న పుట్ట మధు

మంథని, జనవరి 2: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను జడ్పీ చైర్మన్ పుట్ట మధు మంగళవారం మర్యాద పూర్వకంగా హైదరా బాద్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పి మొక్కను అందజేశారు. అనంతరం వీరి మధ్య మంథని నియోజకవర్గంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు, పార్టీ పరిస్థితిపై చర్చ సాగినట్లు సమాచారం.

వైన్ షాప్‌లో చోరీ

రామగిరి, జనవరి 2: మండలంలోని లద్నాపూర్ మహలక్ష్మి వైన్ షాప్‌లో సోమవారం నగదు రాత్రి చోరీకి గురైంది. మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిలో గల వైన్స్‌షాప్‌లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు షాప్‌కు ఉన్న తాళాన్ని పగలగొట్టి లోనికి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న నగదును దొంగిలించారు. మంగళవారం ఉదయం షాప్ తెరిచేందుకు వెళ్లగా చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు యాజమాని రొడ్డ వెంకటేష్ తెలిపారు. షాప్‌లో ఉన్న రూ.98వేలు నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేత్ర దానం

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 2: గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన రిటైర్డ్ కార్మికుడు జెట్టి మల్లయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు ఆధ్వర్యంలో సేకరించారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి కేఎస్ వాసు ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు పంపారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నేత్ర దానం చేసిన మల్లయ్య కుటుంబ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గోదావరిఖని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పూదరి కుమార్, పందిళ్ల శ్యాంసుందర్, జర్నలిస్టులు మాదాసు రామమూర్తి, మల్లిక్, గడ్డం శ్యాం, దయానంద్‌గాంధీ, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

క్రికెట్‌లో ఎలిగేడు యువకుడి ప్రతిభ


గోల్డ్ మెడల్‌తో సాయిప్రశాంత్

ఎలిగేడు, జనవరి 2: మండల కేంద్రానికి చెందిన కాంపల్లి సరోజన-రవిల కుమారుడు సాయిప్రశాంత్ అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడిగా, టీం కెప్టెన్‌గా గుర్తింపు పొందాడు. ఇటీవల వరంగల్‌లో జరిగిన 14వ నేషనల్ రూరల్ గేమ్ ఛాంపి యన్‌షిప్‌లో జట్టుకు నాయకత్వాన్ని వహించి అందులో ప్రతిభ కనబరిచినందుకు గోల్ మెడల్ సాధించాడు. డిసెంబర్‌లో నేపాల్‌లో జరిగిన ఇండో నేపాల్ ఇంటర్నేషనల్ రూరల్ గేమ్ ఛాంపియన్‌షిప్‌లో ఆ జట్టుకు నాయకత్వం వహించి ఆల్‌రౌండర్ ప్రతిభ కనబరిచి ఇంటర్నేషనల్ క్రీడాకారుడిగా గుర్తింపు పొందిన కాంపల్లి సాయిప్రశాంత్‌ను పలువురు అభినందించారు.

పెరిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 2: పురగిరి క్షత్రియ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం సంఘ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలలో కేక్ కట్ చేసిన అనంతరం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కుల బంధువులు ఐక్యంగా ఉంటూ సంఘ అభివృద్ధి కోసం పనిచేయాలని అధ్యక్షుడు సాయి ప్రణీత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లగిశెట్టి చంద్రమౌళి, ఎంబడి పోచన్న, దుండె ప్రశాంత్, రావుల సందీప్, అభిలాష్ పాల్గొన్నారు.

సీఎండీకి అభినందన

మందమర్రి, జనవరి 2: సింగరేణి డైరెక్టర్ ఫైనాన్స్ బలరాం సింగరేణి సీఎండీగా అదనపు బాధ్యతలు ఇవ్వడంతో మంగళ వారం ఐఎన్‌యూసీ సెక్రటరి జనరల్ జనక్ ప్రసాద్ ఆయన కార్యాలయంలో కలిసి అభినందించారు. బల్‌రాంకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి సంస్థ ప్రగతికి ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలని, కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు.